ప్రజాశక్తి

శుక్రవారం 2 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి

సరిపడారాని విద్యాకానుక కిట్లు

- సగం కూడా చేరని పాఠ్యపుస్తకాలు
- నోట్ పుస్తకాల పరిస్థితీ అంతే
- యూనిఫామ్‌కు మీటర్ గుడ్డా రాలేదు
- మరో పది రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పాఠశాలలు పున:ప్రారంభం నాటికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందేలా లేవు. ఈ నెల 12న పాఠశాలలు తెరవనున్నప్పటికీ విద్యార్థులకు సరిపడా పంపిణీ చేసేందుకు జిల్లాకు కిట్లు చేరలేదు. జిల్లాలోని 24 మండలాల్లో వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన 1498 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థులు 1,23,971 మంది ఉన్నారు. వీరిలో బాలురు 59,051 మంది, బాలికలు 64,920 మంది వున్నారు. వీరిలో ఒక్కొక్క విద్యార్థికీ బ్యాగు, బెల్టు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, జత బూట్లు, రెండు జతల సాక్స్‌లు, మూడు జతల యూనిఫాం క్లాత్, ఆరు నుంచి పది విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, ఒకటి నుంచి ఐదు విద్యార్థులకు పిక్టోరియల్ నిఘంటువు ఇవ్వాల్సివుంది. మరో పది రోజుల్లో తరగతులు ప్రారంభంకానున్నప్పటికీ పాఠ్యపుస్తకాలు సరిపడా జిల్లాకు రాలేదు. ఒకటి నుంచి పది విద్యార్థులకు 14,52,043 పాఠ్య పుస్తకాలు అవసరంకాగా 5,11,022 వచ్చాయి. అవసరమైన పాఠ్య పుస్తకాల్లో సగం కూడా రాలేదు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు బ్యాగులు 1,23,971 వచ్చాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ఇచ్చే బెల్టులు సరిపడా 83,777 చేరాయి. నోట్ పుస్తకాలు 8,16,102కు 6,56,980 మండలాలకు పంపించారు. బూట్లు 1,23,735, వాటికి రెండు జతల చొప్పున సాక్స్‌లు వచ్చాయి. ఒక్కొక్క విద్యార్థికీ మూడు జతల యూనిఫామ్ క్లాత్ ఇవ్వాల్సివుంది. కానీ ఇంతవరకూ మీటర్ యూనిఫామ్ క్లాత్ కూడా రాలేదు. ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులు 14,300 మందికి ఇవ్వాల్సిన ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు కొరతలేకుండా వచ్చాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు 6,715 పిక్టోరియల్ నిఘంటువులు అవసరమున్నాయి. ఇవి 3,012 జిల్లాకు చేరాయి.

సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు

పాఠశాలలు పున:ప్రారంభంలోపు జగనన్న విద్యాకానుక కిట్లు రానున్నాయి. సకాలంలో విద్యార్థులకు అందజేయనున్నాం. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఒకటి రెండు రోజుల్లో రానున్నాయి.

ఎం.వెంకటలక్ష్మమ్మ,
జిల్లా విద్యాశాఖాధికారి

అధికారుల బదిలీలు

- ఎపి సిఆర్‌డిఎకు వెళ్లనున్న జివిఎంసి సిపిపి సురేష్‌కుమార్
- విశాఖకు వి.సునీత
- సాంఘిక సంక్షేమ శాఖ జెడి కాకినాడ బదిలీ

సునీత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి, జిల్లా అధికారుల బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం చేపట్టింది. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) చీఫ్ సిటీ ప్లానర్ (సిసిపి)గా పనిచేస్తున్న బి సురేష్‌కుమార్ ఎపి సిఆర్‌డిఎ (అమరావతి)కి బదిలీ అయ్యారు. ఆయన టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్‌గా అమరావతికి వెళ్లనున్నారు. ఆయన స్థానంలో గతంలో జివిఎంసిలో అధికారిగా పనిచేసిన వి.సునీత చీఫ్ సిటీ ప్లానర్‌గా రానున్నారు. విఎంఆర్‌డిఎ కొత్త చీఫ్ అర్బన్ ప్లానర్ (సియుపి)గా కె.సంజయ్ కుమార్ రానున్నారు. ఇక్కడ పనిచేసిన ఎ ప్రభాకరరావు జగనన్న శాశ్వత భూ హక్కు ప్రాజెక్టు (అమరావతి)కి బదిలీ అయ్యారు. వీరు కాకుండా జివిఎంసిలో పలువురు మినిస్టీరియల్ సిబ్బందికి బదిలీలు జరిగాయి. బొబ్బిలి అర్బన్ డవలప్‌మెంట్ అధికారి (కార్యదర్శి), శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అధికారి, పార్వతీపురం మిగతా 2లో..

రౌడీ షీటర్ దారుణ హత్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి పోలీసుస్టేషన్ పరిధిలోగల ఆదర్శనగర్ వద్ద రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆదర్శనగర్‌కు చెందిన వాసుపల్లి లక్ష్మణరావు అలియాస్ క్రాంతి గతంలో జివిఎంసి శానిటరీ విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేసేవాడు. గతంలో రెండు హత్య కేసుల్లో ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రౌడీ షీట్ కూడా తెరిచారు. ఆ తరువాత జివిఎంసి మిగతా 2లో..

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

వార్త 5లో..

బ్రాండిక్స్ బస్సుల ఢీ - 10 మందికి గాయాలు

వార్త 5లో..

రైతుభరోసా పంపిణీ

వార్త 4లో..

ఏర్పాట్లుపై సమీక్ష నిర్వహిస్తున్న శ్రీనివాసమూర్తి

పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకూ విశాఖ జిల్లాలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 10 వరకూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగ్గురు లైజన్ అధికారుల పర్యవేక్షణలో ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ మూడు బ్లాకుల్లో పరీక్షలు జరుగనున్నట్టు తెలిపారు. ఈ పరీక్షకు 1283 మంది అభ్యర్థులు హాజరవుతారని చెప్పారు. పరీక్ష ప్రారంభానికి రెండు గంటలు ముందుగా మాత్రమే పరీక్షా మిగతా 2లో..

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిందే..

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు
- రాష్ట్ర జాతాకు విశాఖలో ఘన స్వాగతం

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ రాష్ట్ర జాతా రెండో రోజైన గురువారం విశాఖపట్నం చేరుకున్న సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో రెండు జాతాలు మే 31న ప్రారంభమై జూన్ 8న విజయవాడ చేరుకుంటాయని తెలిపారు. ప్రజలకు సేవలు అందించడంలో మున్సిపల్ కార్మికులు అగ్రభాగాన ఉన్నారన్నారు. అటువంటి వారిని పర్మినెంట్ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఆప్కాస్ విధానాన్ని తీసుకొచ్చి మరింత బానిసలుగా తయారు చేశారని విమర్శించారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు, హెల్త్ అలవెన్సులు, ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా రావడం లేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని, ఇంజినీరింగ్, మంచినీటి సరఫరా, పార్కుల్లో పనిచేసే కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెటర్నరీ డిపార్టుమెంట్‌లో పనిచేసే కార్మికులకు, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్సు అమలు చేయాలన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు మెరుగైన పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు మిగతా 2లో..

తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోని పలు జోన్లలో ఒకటి, రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జివిఎంసి పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జివిఎంసిలోని టిఎస్ఆర్ ప్రాంగణంలోగల స్టోరేజ్ రిజర్వాయర్లను శుభ్రపరచనున్న నేపథ్యంలో ఈ నెల 3న ఉదయం 10 గంటల నుంచి 4వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ తాగునీటికి ఇబ్బంది ఎదురవుతుందన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

జోన్-2 పరిధిలో..

9, 10, 11 వార్డులలోని మధురవాడ, పిఎం.పాలెం, ఆరిలోవ సెక్టార్ 1 నుంచి 12 వరకు, చినగదిలి, పెదగదిలి, విశాలాక్షినగర్, రవీంద్ర నగర్, బాలాజీ నగర్, ఆదర్శనగర్, ఎస్ఐజి నగర్, సుందర్ నగర్, విశాలాక్షి నగర్, డ్రైవర్స్ కాలనీ ఏరియాల్లో నీటి సరఫరా ఉండదు.

జోన్-3 పరిధిలో..

12 నుండి 27 వార్డులలోని చిన వాల్తేర్, పెద వాల్తేర్, పాండురంగాపురం, రేసువానిపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీ పాలెం, మద్దిలపాలెం, చైతన్య నగర్, వినాయక నగర్, మంగాపురం కాలనీ, జాలారిపేట, ఆదర్శనగర్, వాసవానిపాలెం, ఎంవిపి సెక్టార్ 1 నుంచి 12 వరకు, సీతంపేట ఏరియా, అక్కయ్యపాలెం, లలితానగర్, శ్రీనివాస్ నగర్, ఎన్‌జిఓస్ కాలనీ, చిన్నూరు, శ్రీనివాస్ నగర్, నందగిరి నగర్, నరసింహ నగర్, గణేష్ నగర్, నక్కవానిపాలెం, క్రాంతి నగర్, గాంధీనగర్, సింహాద్రిపురం, లక్ష్మీ నరసింహ నగర్, ఓల్డ్ వెంకోజీ పాలెం, దుర్గా నగర్ ఏరియాల్లో నీటి సరఫరా నిలిపివేస్తారు.

జోన్-4, 5ల్లో..

జివిఎంసి 28 నుంచి 39 వార్డులలోని వెలంపేట, టౌన్ మెయిన్ రోడ్, రంగిరీజు వీధి డౌన్, మంతావారి వీధి, సున్నపు వీధి, రెల్లి వీధి, జబ్బార్ తోట, చిలకపేట, అల్లిపురం ప్రధాన రహదారి, నేరెళ్ల కోనేరు రోడ్డు, అమ్మవారి వీధి, కుమ్మర వీధి, కొబ్బరి తోట, నేతాజీ నగర్, అంబేద్కర్ కాలనీ, జెండా చెట్టు డౌన్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, దండు బజార్, జాలారిపేట, సాలిపేట, కెజిహెచ్, డాబాగార్డెన్ ప్రధాన రహదారి, జగదాంబ జంక్షన్ రోడ్డు, నీలమ్మ వీధి ఏరియాలు, జోన్-5 పరిధి 41 నుంచి 44 వార్డులలోని రైల్వే న్యూ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జ్ఞానాపురం, బాబు కాలనీ, సిరుల వీధి, సెబాస్టియన్ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, సుబ్బలక్ష్మి నగర్, తాటిచెట్ల పాలెం పోర్టు, పోస్టాఫీసు ఏరియా, అబిద్ నగర్, గొల్లల పాలెం, శ్రీనివాస నగర్, నందగిరి నగర్, చెక్కుడురాయి బిల్డింగ్, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, చాకలిపేట, టిఎస్ఎన్ కాలనీ ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. అత్యవసరమైన ప్రదేశాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్టు వేణుగోపాల్ తెలియజేశారు.

మొదటి పేజీ తరువాయి..

అధికారుల బదిలీలు

కో - ఆపరేటివ్ అధికారి యుసిడి ప్రాజెక్టు అధికారులుగా జివిఎంసికి రానున్నారు. విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.వి.రమణమూర్తికి తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు బదిలీ అయ్యింది. శ్రీకాకుళం జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.రామారావు విశాఖ సాంఘిక సంక్షేమ శాఖ జెడిగా బదిలీపై రానున్నారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

కేంద్రం తెరవబడుతుందని, అనంతరం పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు వరకు మాత్రమే అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనికి ప్రవేశ అనుమతి ఉంటుందని అన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించబడవన్నారు. మెటల్ డిటెక్టర్స్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ విధిగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి పరీక్ష హాలులో గోడ గడియారం అమర్చాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు నిరంతరం ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎన్‌డిసి జెవిఎస్.రామ్మోహన్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, డిఎస్ఓ సూర్యప్రకాశరావు, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ ఎ.నరసింహారావు, ప్రసూన, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాల్సిందే..

పరిష్కరించకపోతే ఈ నెల 20 తర్వాత రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల జాతాకు నాయకత్వం వహిస్తున్న నాయకులను అభినందించారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి ఎల్లవేళలా సిఐటియు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. జాతాలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతి బసు, నాయకులు టి.నూకరాజు, పి.వెంకటరెడ్డి, రమణ, వి.కృష్ణారావు, రత్నం, జె.నాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన మున్సిపల్ జాతా గురువారం కొమ్మాది కూడలికి చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, నాయకులు టి.నూకరాజు, ఎ.జ్యోతిబసు, బి.వరలక్ష్మి, కె.లక్ష్మి, జెఆర్.నాయుడు తదితరులకు కొమ్మాది కూడలి వద్ద మధురవాడ 5, 6, 7, 8 వార్డులకు చెందిన జివిఎంసి అవుట్ సోర్సింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్ల సంఘాల సభ్యులు ఘన స్వాగతం పలికారు. పువ్వులు చల్లి, తేనీరు ఇచ్చి అపూర్వ ఆదరణ చూపారు. అనంతరం ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా జాతా నడిచింది. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎపి.ప్రసాద్, మధురవాడ జోన్ కమిటీ నాయకులు ఎస్.రాముప్పుడు, సి.హెచ్.శేషుబాబు, జి.కిరణ్, బి.రాంబాబు, జి.విజయ్, కె.ఈశ్వరరావు, క్లాప్ డ్రైవర్ల సంఘం నాయకులు కె.సన్ని, వై.చిన్నబాబు, ఎం.రాజు, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ దారుణ హత్య

శానిటరీ విభాగం వారు విధుల నుంచి తొలగించారు. అప్పటి నుండి క్రాంతి చిన్న చిన్న సెటిల్‌మెంట్లు చేస్తూ ఉండేవాడు. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో క్రాంతిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో మెడపై నరికి దారుణంగా హత్య చేసి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎంవిపి పోలీసులు, క్రైమ్ డిసిపి నాగన్న, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా గత సంవత్సరం ఆగస్టులో క్రాంతి కుమారుడు శ్యామ్ ప్రకాష్ అనిల్ అనే రౌడీ షీటర్‌ను ఇదే ప్రాంతంలో దారుణంగా హత్య చేశాడు. ఆ హత్య కేసులో శ్యామ్ ప్రకాష్ జైలుకు వెళ్లి ఈ మధ్య కాలంలోనే బయటకు వచ్చాడు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఖాన్

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ లాసన్స్ బే కాలనీలోని కెఆర్ఆర్ వృద్ధాశ్రమానికి గురుస్థానం స్కూల్ మేనేజ్‌మెంట్ గురువారం నిత్యావసర సరుకులు అందించింది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ మాట్లాడుతూ తన తండ్రి జయంతిని పురస్కరించుకొని పాఠశాల తరపున ఈ సాయం చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను జీవితాంతం బాగా చూసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు వృద్ధాశ్రమ వ్యవస్థాపకురాలు రూపకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, వృద్ధులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా పాల్గొన్నారు.

కోరాపుట్ రోడ్‌లో రైళ్ల హాల్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే బోర్డు మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోరాపుట్ రోడ్ స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో రైలు నెంబరు 18107/08 రూర్కెలా - జగదల్‌పూర్ - రౌర్కెలా ఎక్స్‌ప్రెస్, 18447/48 భువనేశ్వర్ - జగదల్‌పూర్ - భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, రైలు నెంబర్ 18514/13 విశాఖపట్నం - కిరండూల్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ రోడ్‌లో ఇక నుంచి ఆగనున్నాయి. తొలి స్టాపేజ్ కార్యక్రమంలో అతిథులు రమేష్ చంద్ర మాఝీ, బలభద్ర మాఝీ, పద్మిని డియాన్ రైల్వే డివిజనల్ మేనేజర్ అనుప్ సత్పతి పాల్గొన్నారు. అనంతరం డిఆర్ఎం అనుప్ సత్పతి విశాఖపట్నం - రాయగడ - దమన్‌జోడి - కొత్వర్ రోడ్ సెక్షన్‌లో విండో ట్రైలింగ్ తనిఖీ నిర్వహించారు. రాయగడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. టికిరి స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ వివిధ సంఘాల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో చర్చించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కోరాపుట్ రోడ్‌లో రైళ్ల ఆగమనాన్ని పునరుద్ధరించడానికి రైల్వే చేస్తున్న కృషిని ప్రజా ప్రతినిధులు అభినందించారు.

హాల్ట్ సౌకర్యాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న అతిథులు

'నాడు - నేడు'కు రైతు బజార్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నాడు - నేడు బాటలోనే రైతు బజార్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.నందకిషోర్ తెలిపారు. గురువారం విశాఖ నగరంలో పలు రైతు బజార్లను సందర్శించిన అనంతరం ఎంవిపి రైతు బజారులో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాల్లో ఉన్న రైతు బజార్లను మరింతగా ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న మరికొద్ది రోజుల్లో రైతులు ఇప్పుడు చెల్లిస్తున్న అద్దెకు బదులు ప్రతి రెండేళ్లకు ఒకసారి వేలంపాట ద్వారా స్టాల్స్ కేటాయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సిసి కెమెరాలు పునరుద్ధరణ, కోల్డ్ స్టోరేజ్ మరమ్మతులు, ఇతరత్రా సమస్యలేమైనా ఉంటే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి స్టాల్ ముందూ ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు.

నేవీ, ఎస్ఎస్‌సి ఉద్యోగాలకు శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ ఛార్జ్‌మెన్, ఎస్-ఎస్‌సి గ్రూప్-సి ఉద్యోగాలకు కోచింగ్ ప్రారంభించనున్నట్లు స్టడీ సర్కిల్ నిర్వాహకులు కె.అభిమన్యు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తరగతులు మొదలవుతాయని తెలిపారు. అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్, జికెలతో పాటుగా 24 ట్రేడ్‌లకు సంబంధించిన అనుభవజ్ఞులైన నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న తరగతులకు ఆసక్తిగల అభ్యర్థులు http://bit.ly/3G1NgEW లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8008412798 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సుప్రీం తీర్పుతో ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సుప్రీంకోర్టు తీర్పుతో అమరావతిలోని పేదల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం కావడం గొప్ప విజయమని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గురునాథం అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కిరణ్‌రాజు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ నాయకుడు మందకృష్ణ మాదిగపై వైసిపి వికలాంగుల హక్కుల విభాగం సభ్యులు బి.కిరణ్ రాజు అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తుల డేవిడ్‌రాజు అన్నారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ఎస్.మల్లేశ్వరి, నాయకులు ఎం.రమేష్ బాబు పాల్గొన్నారు.

791వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఐక్య అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 791వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐ మత్స్యకార మహిళలు కె.లక్ష్మి, కె.కనకరాజు, ఎం.లక్ష్మి, జి.కొండ, జి.నూకాలమ్మ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE CUM FAMILY COURT, VISAKHAPATNAM
FCOP No. 516 / 2023

Between:
Abrar Khan Durrani . . . Petitioner
And:
Md. Razif Ahmed & another . . . Respondents

To
Respondents:
1. Md. Razif Ahmed, S/o. (Late) Fayaaz Ahmed, D.No. 49-13-2, Gnana Nikethan School, St., Lalithanagar, Visakhapatnam - 5300016.
2. Rahamatunnisa Begum, D/o. (Late) Fareed, - Rest Do-

NOTICE

Whereas the above named petitioner instituted a petition against you in this court seeking custody of the minor child Nawaz Sharief Khan Durrani. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all the material questions relating to the matter thereof at **10-30 A.M. on 30-06-2023,** the day and the hour fixed for your appearance and final disposal of the matter. You must be prepared to produce on the day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely on for your defence.

Take notice that in default of your appearance on the day and hour fixed, the matter will be heard and determined in your absence exparte.

(By Order of the Hon'ble Court,
Date : 29-05-2023)

D.SURESH KUMAR
Advocate, Visakhapatnam.
Cell : 9885025272

In the Court of the 2nd Addl. Senior Civil Judge, Visakhapatnam
I.P. No. 12/2023

Between:
Penumaka Chandra Vara Prasad, S/o. (late) Mathew, aged 60 years, Rtd. Employee, D.No. 49-38-6, Flat GR-1, Royal VR Residency, NGO Colony, Akkayyapalem, Visakhapatnam. ...Petitioner

AND

1. Smt. Palanki Maha Lakshmi, W/o. (late) Aritakula Satyanarayana Murthy, aged 60 years, Rtd. Employee, Resident of Flat No. 101, Dr. Manga Rao Residency, Railway New Colony, Visakhapatnam.
2. Palanki Venkateswarlu, S/o. (late) P.Manga Rao, aged 64 years, D.No. 43-14-30, Flat No. 301, Dr. Manga Rao Residency, Railway New Colony, Visakhapatnam.

...Respondents

పై నెంబరు వ్యాజ్యంలో ఒకటవ రెస్పాండెంట్‌ను INSOLVENT గా DECLARE చేసి 1వ రెస్పాండెంట్ 2వ రెస్పాండెంట్ పేరున వ్రాయించి ది. 20-04-2021వ తేదీన దస్తావేజు నెం. 2167/2021గా SRO, ద్వారకానగర్, విశాఖపట్టణం నందు రిజిస్టర్ చేయించిన క్రియ దస్తావేజును Null and Void గా డిక్లేర్ చేయగలందులకు పరిహారము కోరుతూ ఇందలి పిటీషనర్ రెస్పాండెంట్లపై వ్యాజ్యము దాఖలు చేసియున్నారు. పై వ్యాజ్యములో ఎవరికైనను అభ్యంతరములున్న యెడల వారు మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, విశాఖపట్టణం వారి యెదుట **ది. 20-06-2023 తేదీ ఉదయం 10.30 ని॥లకు** వ్యక్తిగతంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని కోర్టు వారికి తెలియపరచవలెను. లేనియెడల ఎవరికిని ఎటువంటి అభ్యంతరములు లేవని పరిగణించి నిర్ణయము తీసుకొనబడును.

జి.డి.ప్రసన్నకుమార్, అడ్వకేట్
పిఠాపురం, సెల్: 93953 89211

జివిఎంసి అధికారుల దాడులపై...

చిల్లర వర్తకుల ధర్నా

ప్రజాశక్తి -పిఎం పాలెం : పొట్ట కూటి కోసం రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలపై జివిఎంసి దాడులు చేయడం అన్యాయమని సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఉపాధ్యక్షులు డి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు మిథిలాపురి ఉడా కాలనీ ప్రాంతంలోని చిరు వ్యాపారులు సిఐటియు ఆధ్వర్యాన మధురవాడ జోన్-2 కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. చిల్లర వర్తకులపై దాడులు ఆపాలని, రక్షణ కల్పించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ధర్నా అనంతరం జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. తమకు వృత్తి చేసుకునేలా అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, వీధి విక్రయదారుల పట్ల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వాలు, స్థానిక అధికారులు అమలు చేయడం లేదన్నారు. చిరు వ్యాపారులపై దాడులు ఆపాలని, వారిని యథావిధిగా వ్యాపారాలు చేసుకోనివ్వాలని, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. స్థానిక నాయకులు కె.పాపినాయుడు మాట్లాడుతూ, పేదలైన వీధి విక్రయదారులను కావాలనే జివిఎంసి సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారన్నారు. అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు తోపుడు బండ్ల కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యకర్తలు చాంద్ పాషా, కె.కామేష్, ఎం.ఆదినారాయణ, ఎన్.కృష్ణ, బి.శ్రీను, టి.అనిత, ఎన్.అరుణ, వై.కనకరత్నం, టి.శ్రీను, ఎన్.శీతంనాయుడు, ఎస్‌కె.రజాక్, అధిక సంఖ్యలో వర్తకులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

నేరాలు ఘోరాలు

లాడ్జీలో పట్టుబడ్డ తుపాకీ

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వే న్యూ కాలనీలోని ఓ లాడ్జి గదిలో ఉన్న వ్యక్తుల వద్ద తుపాకీ పట్టుబడింది. తుపాకీ కలిగి ఉన్న వ్యక్తులపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి డిసిపి గంధం నాగన్న మీడియాకు వెల్లడించారు. లాడ్జీల్లో జరిపే సాధారణ తనిఖీల్లో భాగంగా రైల్వే న్యూకాలనీలోని లక్ష్మీరాయల్ హోటల్‌కు వెళ్లినప్పుడు తుపాకీ కలిగివున్న వ్యక్తులను గుర్తించామన్నారు. హోటల్ రూమ్ నెంబర్-5లో ఆరుగురు మహారాష్ట్రకు చెందిన వారు ఉన్నారు. వారి వద్ద నాటు తుపాకీ ఉంది. ఈ తుపాకీ లైసెన్స్ పిస్టల్‌కు దగ్గర పోలిక ఉంది. గదిలో ఉన్న ఆరుగురిలో ఇద్దరికి మాత్రమే తుపాకి తరలింపు సమాచారం ఉంది. మిగిలిన వారికి ఈ విషయం తెలియదు. గుర్తు తెలియని వ్యక్తి అప్పగించిన పని ప్రకారం ఈ తుపాకీని పూరీ నగరానికి వీరు తీసుకెళ్తున్నారు. తుపాకీ అప్పగించేందుకు రూ.30 వేలు డీల్ కుదిరింది. సదరు వ్యక్తి దారి ఖర్చులకు రూ.10 వేలు ఇచ్చాడు. నాందేడ్ నుంచి పూరీ వెళుతూ విశాఖలో ఆగారు. సుపారీ వ్యవహారంలో వీరు తుపాకీ తీసుకొచ్చారన్నది అవాస్తవమని డిసిపి చెప్పారు. శ్రీధర్ హరికిషన్ సింగ్ పతంగిని అరెస్టు చేశామని, వీరిపై నేర చరిత్ర ఉందా, లేదా ఆనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీరు తీర్థయాత్రకు వెళుతున్నట్లుగా చెపుతున్నారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి - కశింకోట : తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోవడంతో గీత కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం కశింకోట మండలం పల్లపు సోమవారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివి. పి.సోమవారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు దుంగా తాతారావు (64) గురువారం తాటి కల్లుగీసేందుకు చెట్టు ఎక్కగా, నడుముకు కట్టిన తాడు ఊడిపోవడంతో చెట్టుపైనుంచి పడిపోయాడు. ఈ ప్రమాదంలో సంఘటనాస్థలిలోనే తాతారావు మృత్యువాత పడ్డాడు. మృతుని భార్య నూకరత్నం నుంచి అందిన సమాచారం మేరకు కశింకోట పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కల్లుగీతే జీవనాధారం ఉన్న ఆ కుటుంబానికి పెద్దదిక్కు తాతారావు మరణంతో తీవ్ర విషాదంలోకి మునిగిపోయింది. ప్రభుత్వరంగా తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులుకోరుతున్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి గొలుగొండ: మండలంలోని ఏ ఎల్ పురం బస్ స్టేషన్ వద్ద 8 కేజీల గంజాయిని పట్టుకున్నామని కృష్ణదేవిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండు సంచులలో ఎనిమిది కేజీల గంజాయిని తరలించడానికి సిద్ధంగా ఉన్న ముగ్గురు నిందితులను కేడిపేట పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ముగ్గురిలో ఇద్దరు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తులు కాగా ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన నవీన్. నిందితుల వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లుగా ఎస్సై ఉపేంద్ర తెలిపారు.

అప్పన్న తలనీలాల టికెట్ రూ.40

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానంలో శుక్రవారం నుంచి తలనీలాల టికెట్ ధర రూ.40కి పెంచుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఇప్పటి వరకు తలనీలాల టికెట్ రూ.25 ఉండేది. తల నీలాల సిబ్బందికి నెలకు రూ.20వేలు చొప్పున వేతనం చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు.

అప్పన్న ఆలయ ఉద్యోగుల బదిలీ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎఇఒలు, ఆరుగురు సూపరింటెండెంట్లు, ఒక ఎఇ, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, మరికొంతమంది సిబ్బందికి బదిలీ అయింది. విశాఖలోని కనకమహాలక్ష్మి ఆలయం, అన్నవరం, ద్వారకాతిరుమల, విజయవాడలోని ఆలయాలకు బదిలీచేశారు. బదిలీల సమయంలో సిబ్బంది ఆరోగ్య సమస్యలను పరిగణలోకి తీసుకుంటే బాగుండేదని పలువురు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లకు రంగు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం నుంచి గండిగుండం సర్వీస్ రోడ్డు, గండిగుండం నుంచి ఆనందపురం సర్వీస్ రోడ్డు, సొంఠ్యాం, నీలకుండీలు, గుడిలోవ వద్ద స్పీడ్ బ్రేకర్లకు తెల్లని పెయింట్ వేస్తున్నారు. ఆయా స్పీడ్ బ్రేకర్లకు తెల్లని రంగు పోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయని నార్త్ ట్రాఫిక్ సర్కిల్ సిఐ సాయి ఆధ్వర్యాన నేషనల్ హైవే అథారిటీ సహకారంతో తెల్లని రంగు వేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం, డిబిఎల్ ఇంజినీర్ పోలినాయుడు పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాలనపై ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సింహాచలం: వైసిపి నాలుగేళ్ల పాలన పూర్తిచేసిన సందర్భంగా సింహాచలం తొలిపావంచా వద్ద సింహాద్రి అప్పన్నకు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన అందిస్తున్నారన్నారు. 99 శాతం ప్రజలకు ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోలుసు ఈశ్వరరావు, ఎర్రవరం బాబు, కర్రి అప్పలస్వామి, కర్రి సత్తిబాబు, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో హోమం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానంలో గురువారం స్వాతి నక్షత్ర హోమాన్ని అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు హోమ ప్రసాదాన్ని అర్చకులు అందించారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన మేయర్

వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, సింహగిరి కాలనీలో 32వ నెంబరు సచివాలయ పరిధిలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం వేకువజామున పర్యటించారు. 1వ తేదీన ఉదయాన్నే పింఛన్లు అందిస్తున్నారా లేదా అని పింఛన్ల లబ్ధిదారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రాజులమ్మకు వృద్ధాప్య పింఛను, తవుడమ్మకు వితంతు పింఛన్‌ను మేయర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1వ తేదీ ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందించడంలో వాలంటీర్ల పాత్ర అద్భుతమన్నారు. ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే దూరంగా ఉండే కెజిహెచ్‌కు వెళ్లకుండా అందరికీ అందుబాటులోకి యుపిహెచ్‌సిలను తీసుకొచ్చినట్టు తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కోరారు. అత్యుత్తమ సేవలందిస్తున్న వాలంటీర్ జి.కుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ :బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని గురువారం గ్రామీణ తహశీల్దార్ కార్యాలయం వద్ద గల ప్రభుత్వ బాలికల గృహంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి బాలికలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, బాలలు మనో వికాసాన్ని పెంపొందించుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్యే పెరగడం బాలల హక్కన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వాలు అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ పర్యవేక్షణాధికారి సునీత, విజయలక్ష్మి, విజయ, సరస్వతి, కె.త్రినాధమ్మ, డాక్టర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సిసి క్యాడెట్ల శిక్షణ శిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిట్స్ కళాశాల క్రీడా మైదానంలో పది రోజులుగా జరుగుతున్న మూడో ఆంధ్రా నేవల్ యూనిట్ క్యాడెట్ల వార్షిక శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనిట్ కమాండింగ్ అధికారి కమొడోర్ ఇంగ్రీశ్వర్ మాట్లాడుతూ, శిక్షణా శిబిరం ఉద్దేశాన్ని వివరించారు. మాక్ డ్రిల్, వైపరీత్యాలు, ప్రమాదాలు, యుద్ధాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు, షిప్ మోడలింగ్, ప్రాక్టికల్స్, నేవల్ ఓరియెంటేషన్ అంశాలపై అవగాహన కల్పించారు. టగ్ ఆఫ్ వార్, పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక, క్రీడా, సాంకేతిక అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వార్షిక శిక్షణ శిబిరానికి విశాఖ, అనకాపల్లి, అరకు, పార్వతీపురం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలు ప్రభుత్వ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 600 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ, పీడీ వేణుగోపాల్, నేవీ పిఐ బి.అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఏపీ చీఫ్ జడ్జి జస్టిస్ ఎవి శేషసాయి, విశాఖ జిల్లా జడ్జి లాలం శ్రీధర్, మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ సిహెచ్.యుగంధర్ దర్శించుకున్నారు. ఇదే రోజున రాష్ట్ర దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్, ఆర్‌జెసి సురేష్‌బాబు, కాకినాడ డిసి విజయరాజ్, విశాఖ డిసి సుజాత వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ వి.త్రినాధరావు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఇఒ అందించారు.

రైతు బజారు పార్కింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి -మధురవాడ : రైతు బజార్ పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతుబజార్ల ముఖ్య కార్యనిర్వాహణాధికారి ముల్లంగి నందకిషోర్ చెప్పారు. జివిఎంసి 5వ వార్డు పరిధి కొమ్మాది సమీపంలో ఉన్న రైతు బజార్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బజార్‌లోని రైతులు, వినియోగదారులతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, ఇఓ కెనడి పాల్గొన్నారు.

13న పైడితల్లి అమ్మవారి పండగ

ప్రజాశక్తి-సింహాచలం: అడివివరం గ్రామదేవత పైడితలమ్మ పండుగను ఈ నెల 13వ తేదీన జరపనున్నట్లు గురువారం జరిగిన సమావేశంలో దేవస్థానం అధికారులు, గ్రామస్తులు నిర్ణయించారు. ఈ ఏడాది అమ్మవారి పండగకు రూ.10 లక్షలు బడ్జెట్‌లో కేటాయించాలని, పండగను ఘనంగా నిర్వహించేందుకు అని రాజకీయ పార్టీలూ కలిసి పనిచేయాలని నిర్ణయించారు. పండగ సందర్భంగా అడివివరం నుంచి పాత గోశాల వరకు విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయాలని, అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు రాత్రి వరకు నిరంతరం ప్రసాదాన్ని అందించాలని, పండుగ స్టేజీలు 11 గంటల వరకు ఉండేలా చర్యలు చేపట్టాలని దేవస్థానం అధికారులకు గ్రామస్తులు సూచించారు. దేవస్థానం ఇఒ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో పైడితల్లి అమ్మవారి గుడి పూజారి వంశీకులు లండ వెంకటరమణ, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, టిడిపి విశాఖపట్నం కార్యదర్శి పాసర్ల ప్రసాద్, అడవివరం సహకార పరపతి సంఘం అధ్యక్షులు కర్రి అప్పలస్వామి, 98వ వార్డు టిడిపి అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, స్థానిక వైసిపి నాయకులు ఎర్రవరం బాబు, కొలుసు ఈశ్వరరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రైతుభరోసా పంపిణీ

విశాఖ జిల్లాలో రూ.20.97 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 194.66 కోట్లు చెక్కుల అందజేత

రైతుభరోసా చెక్కును అందిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం, పద్మనాభం మండలం, పాండ్రంగి గ్రామంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి రైతుభరోసా, పిఎం.కిసాన్ పంపిణీని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఐదో ఏడాది మొదటి విడతగా వైఎస్ఆర్ రైతు భరోసా -పిఎం కిసాన్ నిధులు విశాఖ జిల్లాలో 27,955 మంది రైతు కుటుంబాలకు మొత్తం రూ.20.97 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. మార్చి - ఏప్రిల్ 2023 అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ కింద 125 మంది రైతులకు రూ.3.26 లక్షలు రాయితీ విడుదల చేసినట్లు చెప్పారు. ఇంకా ఎవరికైనా రైతు భరోసా నిధులు అందకపోతే స్థానిక గ్రామ సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. పాండ్రంగిలో పెండింగ్‌లో ఉన్న వంతెన కోసం త్వరలోనే టెండర్ పనులు చేపడతామన్నారు. అల్లూరి సీతారామరాజు మ్యూజియం పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైతులకు చెప్పిన సమయానికంటే ముందుగానే ఖాతాలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి డబ్బు జమ చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా బటన్ నొక్కి నేరుగా నిధులను లబ్ధిదారుల ఖాతాలలో జమ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం అనంతరం జిల్లాలో లబ్ధిపొందిన 27955 మంది రైతులకు రూ.20.97 కోట్ల రూపాయల మెగా చెక్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, పాండ్రంగి సర్పంచ్ ఝాన్సీ, ఎంపిపి రాంబాబు, మండల వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనంతరం మండలంలోని పలు సమస్యలను ఎంపిపి రాంబాబు, పాండ్రంగి పంచాయతీలోని సమస్యలను సర్పంచ్ ఝాన్సీ జిల్లా కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు.

అనకాపల్లి : పట్టణంలోని గుండాల జంక్షన్ సచివాలయాల సమావేశ మందిరంలో గురువారం జిల్లా రైతు భరోసా, పిఎం కిసాన్ పెట్టుబడి సాయం విడుదల కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి, జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి పాల్గొన్నారు. జిల్లాలో వరుసగా ఐదవ ఏట, మొదటి విడతగా 2,59,549 మంది రైతులకు రూ.194.66 కోట్ల రైతుభరోసా నిధులతో పాటు, ఏప్రిల్ మే మాసాలలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన 698 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.12.89లక్షలను విడుదల చేసినట్లు కలెక్టర్ రవిసుభాష్ వెల్లడించారు. ఈసందర్భంగా కర్నూల్ జిల్లా పత్తికొండలో సిఎం జగన్మోహనరెడ్డి రైతుభరోసా పంపిణీ ప్రత్యక్షప్రసారం తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పలకా యశోద రవి, వ్యవసాయ శాఖ జెడి మోహన్ రావు, హార్టికల్చర్ డిడి ప్రభాకరరావు, ఎంపిపి పెంటకోట జ్యోతి, పెంటకోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు భరోసా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ రవిపటాన్ శెట్టి, ఎంపీ సత్యవతి

శ్మశాన వాటిక ప్రహరీకి శంకుస్థాపన

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధిలోని శ్మశాన వాటికలో రూ.19.98 లక్షల వ్యయంతో చేపట్టే సిసి రోడ్డు, ప్రహరీ నిర్మాణాలకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పార్కులను కూడా త్వరలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వార్డులోని సమస్యలపై స్థానిక వైసిపి నాయకులు ఎమ్మెల్యే ద్వారా మేయర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాస్, నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

10న బిహెచ్‌పివి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : బిహెచ్‌పివి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి కెపి.మిశ్రా తెలిపారు. మే 31న ఓటర్ లిస్ట్ తయారు చేశామని, మొత్తం 162 ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన నామినేషన్లు, 5వ తేదీన స్క్రూటినీ, 6వ తేదీన గుర్తుల కేటాయింపు ఉంటాయని తెలిపారు. 10వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, సాయంత్రం ఐదు గంటలకు కౌంటింగ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

చిన కోరాడలో మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 75వ వార్డు పరిధి చిన కోరాడలో మజ్జిగ చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండాకాలంలో ప్రజలకు చల్లని మజ్జిగ అందించాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటుచేసిన అప్పారావు తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, విశాఖ పార్లమెంటరీ నియోజక వర్గ టిడిపి ఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, టేకేటి పెంటయ్య, పెద్దాడ సోము పాల్గొన్నారు.

దళిత మహిళకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి సాంబనాయక్ కుమార్తె గిరిజన మహిళ ఎస్.మహాలక్ష్మిని ఇటీవల అచ్యుతాపురం లాడ్జిలో అతికిరాతకంగా హత్య చేసిన శ్రీనివాస్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పరవాడ డిఎస్‌పి కెవివి.సత్యనారాయణకు స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందించారు. దీనిపై డిఎస్‌పి మాట్లాడుతూ, ప్రస్తుతం నమోదు చేసిన హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కేసులో కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిపై కూడా అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, ఎస్.మోహన్‌బాబు, పుల్లారావు, దళిత సంఘాల నాయకులు ఎమ్‌డి రాజు, కృష్ణా నాయక్, లక్ష్మీనాయక్, సత్యం నాయుడు, కనికెళ్ల అమ్మాజీ, సాయిప్రసాద్, నేతేటి కృష్ణారావు, నడుపూరి రమణ ఉన్నారు.

'ఏం సాధించారని వైసిపి సంబరాలు?'

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏం సాధించిందని నాలుగేళ్ల సంబరాలు చేస్తున్నారని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులకు జాబ్ కేలండర్ విడుదల చేయలేదని, ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేయలేదని గుర్తుచేశారు. భూముల విలువలను ఆరు నెలలకోసారి పెంచుతున్నారన్నారు. చెత్త పన్ను వేశారని తెలిపారు. విశాఖలో వందలాది ఎకరాలను వైసిపి నేతలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఇవన్నీ మంచి కార్యక్రమాలుగా భావించి సంబరాలు చేస్తున్నారా అని ప్రశ్నించారు.

ఇలా వేసి.. అలా తవ్వేసి...

తాగునీటి పైపులైన్ కోసం తవ్వేస్తున్న రోడ్డు...

ప్రజాశక్తి-సీతమ్మధార : విభాగాల్లో సమన్వయ లోపంతో జివిఎంసి 26వ వార్డులో నెల రోజుల క్రితం కొత్తగా వేసిన రోడ్డపై నీటి సరఫరా విభాగం అధికారులు గోతులు తీయడంతో ప్రజాధనం పూర్తిగా వృథా అయినట్లయింది. 26వ వార్డు పరిధి సంగం ఆఫీస్ రోడ్ నుంచి శంకరమఠం రోడ్డుకు వచ్చే మార్గంలో మూడు రోజుల నుంచి రోడ్డును తవ్వేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షలు ఖర్చు చేసి నూతన రోడ్డు వేయడం, కనెక్టివిటీ కోసం జివిఎంసి నీటి సరఫరా విభాగం సిబ్బంది తవ్వేయడంతో ప్రజాధనం వృథా అవుతోంది. వేసిన కొత్త రోడ్డును తవ్వేయడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం ఇఇ శ్రీనివాసరావును వివరణ కోరగా నీటి సరఫరా విభాగం చేస్తున్న పనిని ఆపమని కోరినట్లు తెలిపారు. నీటి సరఫరా విభాగం ఎఇ రవిని వివరణ కోరగా పైపులైన్లు పాతవి కావడంతో తాగు నీరు కలుషితం అవుతుందని, స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గత కమిషనర్ రాజాబాబు సమయంలో టెండర్ పిలిచినట్లు తెలిపారు. దీనిలో భాగంగా కొత్త పైప్ లైన్ వేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా కూన అవినాష్ వర్థంతి

ప్రజాశక్తి -మాధవధార : అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బోటు ప్రమాదంలో మృతిచెందిన కూన అవినాష్ నాలుగో వర్ధంతిని కుటుంబ సభ్యుల మధ్య గురువారం నిర్వహించారు. అవినాష్ చిత్రపటానికి అతని తండ్రి, సిఐటియు నాయకులు కూన వెంకటరావు, తల్లి మహిళా సంఘం నాయకులు జనార్దనమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుని జ్ఞాపకార్థం కుర్మన్నపాలెంకు చెందిన పేద విద్యార్థి హనీష్ యాదవ్‌కు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, ప్రముఖ గైనకాలజీ డాక్టర్ ఎ.నిర్మల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అవినాష్ అమెరికాలో ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఉచితంగా వైద్యం అందించారని ఈ సందర్భంగా అందరూ గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అవినాష్ సావే ఫౌండేషన్ కార్యదర్శి మృదుల, కోశాధికారి ఎస్.ధనుంజయస్వామి, ఎస్.శ్రావణ్‌కుమార్, మహిళా నాయకులు పి.శ్రీదేవి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

అవినాష్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కుటుంబ సభ్యులు

ఆలయాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది జంక్షన్‌లో ఉన్న హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పద్మనాభం జంక్షన్‌లో...

పద్మనాభం జంక్షన్‌లో ఉన్న విఘ్నేశ్వర, షిర్డీ సాయిబాబా, పార్వతమ్మ దేవాలయాల 19వ వార్షికోత్సవాన్ని గురువారం ప్రారంభించారు. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయాల వ్యవస్థాపకులు మొకర అప్పలనాయుడు ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు.

పిఎం.పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎంపాలెం చివరి బస్సు స్టాప్ వద్ద షిరిడి సాయి పద్మ సాయి ఆలయంలో 27వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. చివరి రోజున ధునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 1500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, కార్యదర్శి రాంబాబు, ఉపాధ్యక్షులు నారాయణరావు, గౌరవాధ్యక్షులు ఇవిఎస్ చంద్రరావు, సలహాదారులు గొల్లంగి ఆనందబాబు, సభ్యులు సర్వ దేవుళ్ళు, పాపారావు, గోవింద్, పోతిన గిరిబాబు, బలరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లిలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 65 మందికి తనిఖీలు నిర్వహించారు. 13 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని వైజాగ్‌లోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కశిరెడ్డి దామోదరరావు సహకారంతో నిర్వహించారు.

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

అనకాపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాలు

మహిళా రెజ్లర్ల ఆందోళనకు ప్రజాసంఘాల సంఘీభావం

ప్రజాశక్తి -అనకాపల్లి : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వామపక్ష ప్రజా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నేతలు కోరారు. ఈ మేరకు జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపుమేరకు గురువారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మహిళా రెజ్లర్ల ఆందోళనకు సంఘీభావంగా ధర్నా నిర్వహించారు. మహిళా రెజ్లర్లపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ, పిఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ, లైంగిక వేధింపులకు గురైన రెజ్లర్లు తమకు న్యాయం చేయాలని ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నెలరోజులకు పైగా ఆందోళన చేస్తుంటే, వారికి న్యాయం చేయాల్సిన ప్రభుత్వం, పోలీసులు, బలవంతంగా దీక్షాశిబిరాన్ని తొలగించడంతోపాటు బాధితులపైనే క్రిమినల్ కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు ఢిల్లీ పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు.

అనకాపల్లి అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐఆర్ గంగాధర్ మాట్లాడుతూ, రాహుల్‌గాంధీపై ప్రయివేటు కేసులో కిందిస్థాయి కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ప్రజలు ఓట్లేసి గెలిపించిన పార్లమెంట్ సభ్యత్వాన్నే రద్దుచేసిన మోడీ ప్రభుత్వం, తమ పార్టీ ఎంపిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్‌మంత్రి సాయి లక్ష్మణరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేత ఆర్ దొరబాబు, సిఐటియు జిల్లా కోశాధికారి వివి. శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు బొప్పే ఉమామహేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, అసంఘటిత కార్మికుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎస్. గణేష్, కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, బుద్ధ కిషోర్, ఎ.దేవుడమ్మ, పిల్లి త్రినాథ్, వి. రాంప్రసాద్, ఎఐవైఎఫ్ నేత వియ్యపు రాజు, రైతు సంఘం నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాంబిల్లి : ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా రాంబిల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేముడునాయుడు మాట్లాడుతూ, భేటీ బచావో అంటూ ప్రధాని మోడీ ఇచ్చిన నినాదానికి, ఆచరణకు ఎక్కడా పొంతన లేదని విమర్శించారు.మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు. సిహెచ్. రామకృష్ణ, గణేష్, రాంబాబు, సి.నారాయణరావు. వై.రాము. సిహెచ్. అప్పలి పాల్గొన్నారు

రాంబిల్లిలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన

అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా మునిస్వామి

బుద్ధ మునిస్వామి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా బుద్ధ మునిస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా అంతటా బాల కార్మికుల వ్యవస్థపై ప్రత్యేక తనిఖీలు ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీల్లో కార్మిక శాఖ సిబ్బందితోపాటు ఐసిడిఎస్, ఎస్ఐడి ఎన్‌జిఒ, పోలీస్, బచ్‌పన్ బచావో, చైల్డ్ లైన్ విభాగాలు పాల్గొంటాయన్నారు. దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇతర సంస్థల్లో బాల కార్మికులను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : రచయిత తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలగాలని కోరుకుంటాడని ప్రముఖ రచయిత ఎల్ఆర్.స్వామి తెలిపారు. చైతన్య సమితి ఆధ్వర్యాన ఎల్లపు ముకుంద రామారావు రచించిన పంచభూతాలుగా భావించిన అనువాద కవిత్వ గ్రంథాల పరిచయ కార్యక్రమం గురువారం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'అదే నీరు' పుస్తకాన్ని డాక్టర్ కెజి.వేణు, 'అదే ఆకాశం' పుస్తకాన్ని ఆచార్య అయ్యా సీతారత్నం, 'అదే గాలి' పుస్తకాన్ని డాక్టర్ డివి సూర్యరావు, 'అదే కాంతి' పుస్తకాన్ని డాక్టర్ కెవెన్.మల్లీశ్వరి పరిచయం చేసి విశ్లేషించారు. పంచభూతాలపై పుస్తకాలు రాసిన ఎల్లపు ముకుంద రామారావును పలువురు రచయితలు అభినందించారు కార్యక్రమంలో చైతన్య సమితి కోశాధికారి కొరపూడి రవి, కార్యదర్శి డివి.రమణ, వేగి లావణ్య పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే జన సంక్షేమం

'గడపగడప'లో మంత్రి అమర్‌నాథ్

కల్వర్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి- అనకాపల్లి : జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే జనం క్షేమంగా ఉన్నారని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. గురువారం 83 వార్డు లక్ష్మీదేవి పేటలో కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులోని అన్నపూర్ణ బ్యాంకు రోడ్డు, మిరియాల కాలనీ మూడో వీధిలో రూ. 76 లక్షలతో నిర్మించతలపెట్టిన కల్వర్టుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలు జగన్మోహన్ రెడ్డి పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, నిరాటంకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం, సిఐటియు గౌరవాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. గురువారం మండలంలో అచ్చుతాపురం, దోసూరు, కొండకర్ల గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, బోర్డులోని రూ.వెయ్యి కోట్లను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ప్రమాదాల గురై చనిపోయిన కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలన్నారు. నాలుగేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా రావాల్సిన ఎటువంటి ప్రయోజనాలు అందడం లేదని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె. సోము నాయుడు, మణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు రాజన్న, అప్పలనాయుడు, గాలి పైడిరాజు పాల్గొన్నారు.

ఆర్ఎంపి వైద్యుడు రంగారావు మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణం నాయుళ్ళ వీధికి చెందిన సీనియర్ ఆర్ఎంపి వైద్యులు తుమ్మపాల రంగారావు (84) గురువారం మధ్యాహ్నం దర్గీనగర్‌లోని స్వగృహంలో మృతి చెందారు.కొంతకాలంగా దర్గీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య సూర్యకాంతం, కుమారుడు తులసీరావు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం ఉదయం డాక్టర్ రంగారావు అంత్య క్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రంగారావు (ఫైల్‌ఫొటో)

రాయితీపై పాలు పితికే యంత్రం పంపిణీ

యంత్రం సాయంతో పాలు తీస్తున్న రైతు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : డెయిరీ ఫారం నిర్వహించే రైతులకు అండగాఉండాలనే లక్ష్యంతో విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో బుచ్చయ్యపేటకు చెందిన సుంకర వెంకటరమణ అనే రైతుకు మిల్కింగ్ మిషన్ (పశువుల నుండి పాలు తీసే యంత్రం) ను పంపిణీ చేశారు. రాయితీపై రూ.33వేలకే దీనిని పాడిరైతుకు గురువారం విశాఖ డెయిరీ సిబ్బంది అందజేశారు.

బుచ్చయ్యపేటలో పది పాడి పశువులతో డెయిరీఫారం నిర్వహిస్తున్న సుంకర వెంకటరమణ, రోజూ పది ఆవుల నుంచి సగటున వంద లీటర్ల పాలను విశాఖ డెయిరీకి సరఫరా చేస్తున్నాడు. అయితే పెద్దమొత్తంలో పాడిపశువుల నుంచి పాలు పితకడం కష్టం కావడంతో విశాఖ డెయిరీ పాలు పితికే యంత్రాన్ని సమకూర్చిందని పాడిరైతు వెంకటరమణ తెలిపాడు. విశాఖ డెయిరీ సూపర్వైజర్ గొల్లవిల్లి నాగేశ్వరరావు, వెతన కార్యదర్శి పాచిల మణి, పులిగా సురేష్ పాల్గొన్నారు.

బ్రాండిక్స్ బస్సుల ఢీ : 10 మందికి గాయాలు

క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ పరిశ్రమ ఆవరణలో గురువారం మధ్యాహ్నం రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో పదిమందికి గాయాలయ్యాయి. "ఏ షిఫ్ట్ ముగించుకొని బ్రాండిక్స్ కార్మికులు ఇంటికి తిరిగి వెళుతున్న సమయంలో బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని అంటున్నారు. ప్రమాదంలో గాయాలైన మహిళా కార్మికులు ఎన్.సత్య, లక్ష్మి కుమారి, రామలక్ష్మి దాన నాగలక్ష్మి, ఇ.లక్ష్మీదేవి తదితరులను వెంటనే అచ్యుతాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. తీవ్రగాయాలతో ఆరోగ్యం విషమంగా ఉన్న ఒక మహిళా కార్మికురాలిని అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే ఎటువంటి ప్రాణాపాయం లేదని అంటున్నారు.

సిఐటియు నేత రాము పరామర్శ

బ్రాండిక్స్ వద్ద రెండు బస్సులు ఢీకొని, పదిమంది మహిళాకార్మికులకు గాయాలయ్యాయన్న సమాచారంతో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము వెంటనే స్పందించి క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లారు. బాధితులను పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును, కార్మికుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, నయమయ్యే వరకు వేతనం కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. బస్సులలో ప్రయాణం చేసే కార్మికులకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని సూచించారు. బస్సులకు మధ్య కనీస దూరం, ప్రయాణంలో వేగనియంత్రణ, సురక్షిత ప్రయాణంపై డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అప్రమత్తంచేస్తూ అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

బ్రాండిక్స్ కంపెనీలో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బస్సు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో కోరారు. వైద్య కాలంలో వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. బ్రాండిక్స్ కంపెనీ బస్సుల ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప పూర్తిస్థాయిలో నివారించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని తెలిపారు. కార్మికులకు భద్రత లేకుండా పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వామ్యమై కీలకపాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం కోరారు. విశాఖ పర్యటనలో ఉన్న వీరు గురువారం సీతమ్మధారలోని 14, 15, 16 వార్డుల సచివాలయాల సిబ్బందితో సమావేశమై బాలల కోసం అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులకు తగు సూచనలు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ఇతర రెవెన్యూ ధ్రువ పత్రాల జారీలో రెవెన్యూ కార్యదర్శులంతా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. స్త్రీ,శిశు సంక్షేమ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయాల ప్రతినిధులు బి.మహాలక్ష్మి, కెవి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల, వై.మంగ, బి.సతీష్, లావణ్య, హేమలత, ఆది, సోంబాబు, ఎస్.జనార్దనరావు పాల్గొన్నారు.

అభ్యంతరకర పోస్టర్లు తొలగించాల్సిందే..

ప్రజాశక్తి- అనకాపల్లి : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌ను కించపరిచేలా విద్వేషకరంగా వైసిపి ఏర్పాటు చేసిన పోస్టర్లు తొలగింపులో జివిఎంసి అధికారుల నిర్లక్ష్యంపై గురువారం జనసేన నేతలు ఆందోళన చేపట్టారు. జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం ఎదుట బైఠాయించి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తూ ధర్నా చేపట్టారు. వైసిపి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని బుధవారం జనసేన నేతలు జెడ్సీ వెంకటరమణను కలిసి విన్నవించినప్పటికీ, ఆయన ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై మండిపడ్డారు. జివిఎంసి యంత్రాంగం వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, తాము చేసిన విజ్ఞప్తిపై జెడ్‌సి వచ్చి సమాధానం చెప్పాలని జనసైనికులంతా భీష్మించడతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పట్టణపోలీసులు ధర్నా శిబిరానికి చేరుకుని జనసైనికులను వారించారు. ఈ సందర్భంగా పోలీసులు, జనసైనికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో దూలం గోపి, మళ్ల శ్రీను, తాడి రామకష్ణ, బర్నికాన రాము, అప్పికొండ గణేష్, గంగుపాం జగదీష్, కోన దుర్గ, కాండ్రేగుల ప్రసాద్, సీత,లోకేష్, గణేష్ వర్మ తదితర జనసేన నేతలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

కొనసాగుతున్న పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా రేబాక పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో పాలిటెక్నికల్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు నాలుగో రోజు 117 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను కళాశాల సిబ్బంది పరిశీలించారు. 43 వేల నుంచి 59 వేల ర్యాంకు వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది..81 మంది బాలురు. 36 మంది బాలికలు హాజరయ్యారు. శుక్రవారం 59,001 ర్యాంకు నుంచి 75 వేల ర్యాంకు వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. గురువారం హాజరైన అభ్యర్థులకు ప్రిన్సిపల్ ఐ విఎస్ఎస్ శ్రీనివాసరావు ఐసిఆర్ పత్రాలను అందజేశారు.

డిఎస్‌సి 1998 అభ్యర్థుల హర్షం

- సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఎట్టకేలకు తమకు నియామక ఉత్తర్వులు జారీ చేయడంపై డిఎస్‌సి 1998 అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక జేఎంజే పాఠశాలలో ఎంపి డాక్టర్ బివి.సత్యవతి ఆధ్వర్యంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైసిపి గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, భీమిలి డైట్ ప్రిన్సిపల్ యు మాణిక్యాల నాయుడు, సెంటర్ కోఆర్డినేటర్ సిజిఎస్ నాగేశ్వరరావు,జెఎంజె స్కూల్ ప్రిన్సిపల్ మంజుల, సుదర్శన్, ఎస్‌కె.జిలాని, శాస్త్రి, నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని నారపాడు గ్రామానికి చెందిన మహిళ పాముకాటుకు గురై గురువారం ఉదయం మృత్యువాత పడింది. వివంనారపాడు గ్రామానికి చెందిన రాజాన పరదేశమ్మ (57)గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో కల్లానికి వెళ్తుండగా పాము కాటు వేసింది. దీంతో పరదేశమ్మకు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. కెజిహెచ్‌కు తరలించే క్రమంలో మార్గమధ్యలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చూపించగా, అప్పటికే పరదేశమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన పరదేశమ్మ మృతితో బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగు సహాయం అందించాలని సర్పంచ్ మామిడి శంకరరావు, గ్రామస్తులు కోరారు.

నేటి నుంచి జార్జిక్లబ్‌లో నాటకోత్సవాలు

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జార్జి క్లబ్ పాలకవర్గ సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జార్జిక్లబ్ వైకె. నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, ఆదిలీలా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు జార్జిక్లబ్ కొణతాల వెంకటనారాయణమ్మ కళాప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, మళ్ల చంద్రశేఖర్, ఆళ్ల వెంకట నూకేశ్వరరావు, కె.యం నాయుడు తెలిపారు. గురువారం జార్జిక్లబ్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కళలకు పుట్టినిల్లయిన అనకాపల్లిలో 1935- 36లో స్థాపించిన జార్జిక్లబ్ ద్వారా అనేక క్రీడా సాంస్కృతిక పోటీలు, కార్యక్రమాలు నిర్వహిస్తూ అభివృద్ధి చేశామన్నారు. సమాజానికి మంచి సందేశాలను ఇచ్చేందుకు జార్జిక్లబ్ నిరంతరం కృషి చేస్తోందని, అందులో భాగంగా ఈ ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు పట్టణ ప్రజలకు వినోదంతోపాటు చైతన్యాన్ని, మానసిక ఆనందాన్ని కలిగించేందుకు వీటిని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు క్లబ్ పాలకవర్గంతో పాటు పలువురు దాతలు ఆర్థికంగా సహకారాన్ని అందిస్తున్నారన్నారు. నాటిక పోటీలకు కన్వీనర్‌గా కెయం నాయుడు వ్యవహరిస్తారన్నారు.

నాటిక ప్రదర్శనల వివరాలివే.

జార్జిక్లబ్ నాటకోత్సవాల్లో భాగంగా 2న, సాయంత్రం ఆరున్నర గంటలకు శ్రీకాకుళం బోరివంక శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో 'నిర్జీవ నినాదం' నాటిక, 8 గంటలకు విశాఖపట్నం తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటిక, 3న హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు', ఎనిమిది గంటలకు గుంటూరు అభినయఆర్ట్స్ 'అతీతం' నాటికను, 4న, గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ 'నాన్నా నేనొచ్చేస్తా' చిలకలూరిపేట ది అమెచ్యూర్ డ్రమటిక్ అసోసియేషన్ వారి 'ఆలీతో సరదాగా' హాస్యనాటిక ప్రదర్శితమౌతాయన్నారు. విజేతలకు జ్ఞాపికలతోపాటు నగదు పురస్కారాలను అందజేస్తామన్నారు. జార్జిక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించేసాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ఎఐకు వినతిపత్రం ఇస్తున్న కార్మికనేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరుతూ గురువారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి ఆర్డీవో కార్యాలయం ఎఐటియుసి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించి, ఎఒ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా నేత రాజాన దొరబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డ్ ద్వారా పథకాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 32వేల క్లెయిమ్స్‌ను తక్షణమే పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో చేరిన కార్మికులందరికీ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని, సంక్షేమ బోర్డు నిధులు మళ్లించకుండా కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. 55ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలసరి రూ.ఐదు వేలు పింఛను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నేతలు అప్పలరాజు దేవుడు బాబు, కన్నబాబు వీరాచారి, వియ్యపు రాజు, చొప్పా కోటి, ఓమ్మి సూరిబాబు,నరాలశెట్టి సత్యనారాయణ, సాయి, సతీష్ జస్వంత్, శ్యామ్, అప్పారావు, తాతాలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు తగవు

మాట్లాడుతున్న వీరు యాదవ్

ప్రజాశక్తి -అనకాపల్లి : మాదిగ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు మందకష్ణ మాదిగపై వైసిపి వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు, వికలాంగుల హక్కుల పోరాట సమితి అనకాపల్లి జిల్లా ప్రధానకార్యదర్శి పాత్రపల్లి వీరుయాదవ్ డిమాండ్ చేశారు.గురువారం వుడ్‌పేటలోని కార్యాలయంలో అత్యవసర సమావేశంలో మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా వికలాంగులకు రూ.ఆరు వేలు పెన్షన్ చెల్లించాలని, 2016 వికలాంగుల హక్కుల చట్టం సంపూర్ణంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పథకాలన్నీ పునరుద్ధరించాలని తదితర వికలాంగుల సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారన్నారు. ముఖ్యమంత్రి స్పందించకుంటే చలో అమరావతి, సిఎం ఇంటి ముట్టడి తప్పదని హెచ్చరించిన నేపథ్యంలో వికలాంగుల సమస్యలపై కృష్ణమాదిగ పోరాటానికి తోటి వికలాంగులుగా హర్షించాల్సిన కిరణ్‌రాజ్, వైసిపి ప్రాపకం, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని, వీటిని ఖండిస్తున్నట్లు వెల్లడించారు. యలమర్తి రవి, ముక్క గణేష్, చెట్టుపల్లి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో బోరు బావి నిర్మాణం

బోరు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామదేవత శ్రీపరదేశిమాంబ గుడి పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో బోరు బావి నిర్మాణాన్ని ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు గురువారం ప్రారంభించారు. ఆలయం వద్ద తాగునీటి అవసరాలకు బోరు బావి ఏర్పాటు చేసిన ఎంపిపి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కొటాన రాము, మండల వైస్ ఎంపిపి శరగడం ఝాన్సి లక్ష్మి రాము, స్థానిక ఎంపిపి బైలపూడి దేముడుబాబు, మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ మండల లక్ష్మణ్, బోను నాయుడు, నేబర్తి శ్రీను, గ్రామపెద్దలు, కొటాన అప్పారావు, మడ్డు సూర్యనారాయణ, ఆదిరెడ్డి పోతురాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఒ హిమబిందు పాల్గొన్నారు.

కొండకర్లలో వైద్యశిబిరం

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కల్యాణి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : కొండకర్ల గ్రామ సచివాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులను డాక్టర్ వి కల్యాణి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రతి నెలా మొదటి, మూడు గురువారాల్లో వైద్యశిబిరాలను నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అధికరక్తపోటు, మధుమేహంతోపాటు 67 రకాల వ్యాధులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగానే మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. డిఇఒ కె.శిరీష, జె.రమ్య, , కె.లక్ష్మీ, ఆశావర్కర్లు జి.శ్రీదేవి,ఎంపిటిసి కట్టుమురి వెంకటలక్ష్మి శ్రీను పాల్గొన్నారు.

'ఆందోళనతో సంబంధం లేదు'

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ఆందోళనకు, ఎఐటియుసికి ఎటువంటి సంబంధం లేదని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ విషయాన్ని భవన నిర్మాణ కార్మికులు గమనించాలని కోరారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి గవరపాలె కామాక్షి దేవి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట గురువారం ఘనంగా జరిగింది. విగ్రహదాతలు పొన్నాడ సుందరయ్య (చిట్టి) కుమారులు వెంకటసత్య నర్సింహచారి, బ్రహ్మోజీ కుటుంబసభ్యులు విగ్రహ ప్రతిష్ట చేశారు. స్వామిని మాజీ మంత్రి దాడివీరభద్రరావు, ఎంపి డాక్టర్ బివి.సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధనను వైసిపి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య రాంబాబు, 83వ వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ వెంకటసత్య నరసింహాచారి (పెదబాబు), విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- కె.కోటపాడు : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయానికి అనుగుణంగా, ఆంధ్రుల అన్నపూర్ణమ్మ దివంగత డొక్కా సీతమ్మ ఆహారనిధి పేరుతో అన్నసమారాధన నిర్వహించడం ఆనందంగా ఉందని ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గ నాయకులు రాయపరెడ్డి కృష్ణ అన్నారు. కె.కోటపాడు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సాయిమందిరంలో జనసేన ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి గురువారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు జనసేన మండలనాయకులు కుంచా అంజిబాబు అన్నారు. కార్యక్రమంలో చుక్కా నారాయణమూర్తి, ఇస్మార్ట్ శంకర్ ,హరీష్, జగదీష్, సత్యనారాయణ, ఆనంద, రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ పండగ

ప్రజాశక్తి - పరవాడ: మండల కేంద్రంలోని దుర్గమాంబ పండుగ గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనను రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనువాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పైల అప్పారావు, ఆలయ ధర్మకర్త పైలా పోతినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు ఎంపిడిఒ హేమసుందరరావు ఉప సర్పంచ్ బండారు రామారావు, వైసిపి నేతలు పైలా హరీష్, రెడ్డి శ్రీనువాసరావు, సిరపురపు రాజేష్, వ్రి హరి, పైలా పైడింనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు మండలంలో చందనాడ గ్రామంలో.గురువారం ఉపాధి కూలీలతో ఎం.అప్పలరాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్‌లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలు తగ్గించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరంలో జాబ్ కార్డున్న ఇద్దరు ఉన్న కుటుంబానికి ప్రస్తుతం 100 రోజులు పని కల్పిస్తుంటే భార్య, భర్తకు చెరో 50 రోజులు మాత్రమే పని ఉంటుందనాన్నరు. 100 రోజు లు వ్యవసాయసాయ పనులు, ఉపాధి పనులు 50 రోజు లు కలిపి 150 రోజులు పని ఉండగా సంవత్సరంలో మిగతా రోజులు కూలీలకు పనులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజు వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న అప్పలరాజు

చెత్తను ఏరుతున్న సర్పంచ్, సిబ్బంది

చెరువులో చెత్తాచెదారం ఏరివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో తిమ్మాపురం పంచాయతీ పరిధిలో వీర బ్రహ్మంగారి చెరువు వద్ద మిషన్ లైఫ్ క్యాంపెయిన్ నిర్వహిచారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా చెరువులో ఉన్న చెత్త,ప్లాస్టిక్‌ను శుభ్రపరిచారు. అనంతరం కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్లాస్టిక్‌ను పడేయడంతో పర్యావరణం కాలుష్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో చందనాడ గ్రామం ఎస్సీ కాలనీలో గోరింట గోవిందరాజులు, ద్రాక్షారపు అప్పారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. అదేవిధంగా కాలనీకి చెందిన యువకుడు ఏడిద ప్రసాద్ కశింకోట మండలం వెదురుపర్తి లో నదిలో జారి మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్‌లు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఘనంగా జానకి శ్రీను జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కోటవురట్ల: టిడిపి మండల అధ్యక్షుడు జానకి శ్రీను జన్మదిన వేడుకలు గురువారం ఆయన స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా 25 గ్రామాలకు చెందిన కార్యకర్తలుపెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేచలపు జనార్ధన్, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, భాస్కరరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సుంకర బాబ్జి, వివిధ గ్రామాలకు చెందిన టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున నాయకులు

నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎర్రమనాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ:బడుగు బలహీన వర్గాల కోసం పోరాటాలు చేసిన వారిలో కామ్రేడ్ ఎర్రమనాయుడు ముందంజలో ఉంటారని సిపిఐ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు కొనియాడారు. మాజీ ఎంపీపీ, కమ్యూనిస్టు నేత ఎర్రమ్మ నాయుడు 10వ వర్ధంతి గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామంలో ఆయన స్థూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు ఆయన స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరం పార్టీ ఆశయాల సాధన కోసమే పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు జడ్పిటిసి వార నూకరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లగుడు వెంకటరమణ, మండల పార్టీ కార్యదర్శి మేక భాస్కరరావు, ఎస్సై చిన్నరాజు, రైతు సంఘం నాయకులు మేక సత్యనారాయణ, ఆయన కుమార్తె చందన, కత్తి తాతబ్బాయి, లోచల భెన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల పర్యటన

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్:నాతవరం మండలం గన్నవరం గ్రామంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర చేపట్టారు. గురువారం నాతవరం మండలం గన్నవరం గ్రామంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా మంచినీటి కుళాయిల నుంచి నీరు రాలేదని మహిళలు తెలిపారు. వెంటనే ఫోన్‌లో ఎంపీడీవోతో మాట్లాడుతూ మంచినీటి సమస్యను తీర్చాలని ఆయనకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండలం యూత్ అధ్యక్షులు బైన మురళి, వేగిశెట్టి శ్రీనివాస్, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఒ

పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుండి ప్రారంభమవుతున్న పదవ తరగతి సప్లిమెంటరీ నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను గురువారం పరీక్షాకేంద్రం విభాగాధిపతి వై.అప్పారావు పరిశీలించారు. ఏర్పాట్లపై ఛీఫ్ సూపరింటెండెంట్ రాణీ లలితను అడిగి తెలుసుకున్నారు. 270 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు ఉన్నారు.

20న చలో విజయవాడ

ప్రజాశక్తి-మాడుగుల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 20న చేపడుతున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. గురువారం మాడుగుల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈ సమాజంలో సంఘం అధ్యక్షులు కల్లా నాగేశ్వరరావు, గుమ్మాలు సీతారాం, వుయ్యపు సింహాద్రి, రమేష్, పల్ల నూకరాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మణ

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ మలేరియా మాసోత్సవం సందర్భంగా ఆ వ్యాధి నివారణపై విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలుచోట్ల అవగాహన ర్యాలీలను గురువారం నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే ఈ వ్యాధి నివారణకు పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, దోమ తెరలు వాడటం చేయాలని సూచిస్తూ మలేరియా విభాగ సిబ్బంది అవగాహన కల్పించారు.

ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామంలో మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.హరీష్, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఎస్‌యుఒ నూకరాజు, అరోగ్య విస్తరణ అధికారి ఎమ్. పరమేశ్వరరావు, అరోగ్య పర్యవేక్షకులు పి.సన్యాసిరావు, సిహెచ్‌ఒఎం ఇందు, ఆరోగ్య కార్యకర్తలు జి.సత్యవతి, జి.రమణ, రమేష్, ఆశా కార్యకర్త బూస అన్నపూర్ణ, బొడ్డపు శివశంకరి పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యాన గాజువాకలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, నాగప్పారావు, శ్రీనివాస్, పద్మ పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డులో అవగాహన ర్యాలీని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మలేరియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మంగరాజు, మలేరియా విభాగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ములగాడ : 62వ వార్డు పరిధి త్రినాధపురంలో మలేరియా నివారణ మాసోత్సవాలను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చేపట్టిన అవగాహన ర్యాలీలో బయాలజిస్ట్ చక్రవర్తి, జిల్లా మలేరియా నోడల్ అధికారి నాగశ్రీను, మల్కాపురం మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, హెల్త్ అసిస్టెంట్లు రోమాల వేణుబాబు, రాజ్ కుమార్, హెల్త్ సెక్రటరీ రమ్య తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక పాత బస్టాండ్ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ హాజరై మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్.సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామ సచివాలయాల్లో మలేరియా నివారణ మాసోత్సవాలు పురస్కరించుకొని అవగాహన ర్యాలీలు, శిబిరాలు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ వాసంతి తెలిపారు. సర్వసిద్ధి పి హెచ్ సి వద్ద అవగాహన శిబిరం నిర్వహించారు .ఈ సందర్భంగా మలేరియా ఇన్ఛార్జ్ నోడల్ ఆఫీసర్ పి ఎన్ వి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, కీటక జనిత వ్యాధుల బారిన పడకుండా దోమల వృద్ధి రేటును అరికట్టాలన్నారు.ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, ప్లాస్టిక్ డబ్బాలు, డ్రమ్ములు కొబ్బరి బొండాలు, డ్రింక్ సీసాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా మాసోత్సవాలు ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కె.హరినాథ్, స్టాఫ్ నర్స్ అరుణ, సచివాలయం హెల్త్ సెక్రెటరీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

పుస్తక పఠనంపై అవగాహన

గొలుగొండలో ఆడుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-గొలుగొండ: విద్యార్థులందరికీ విద్యతో పాటుగా వ్యాయామం అవసరమని గ్రంథాలయ అధికారి రాజుబాబు అన్నారు. వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఖోఖోపై శిక్షణ ఇచ్చారు.

కోటవురట్ల:స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనం పై అవగాహన కల్పించారు.రిసోర్స్ పర్సన్ రాంబాబు మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం పుస్తకాలను చదువుకోవాలని సూచించారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖా గ్రంథాల యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రుల ప్రాముఖ్యత ను వివరించారు. సిహెచ్ భవాని స్పోకెన్ ఇంగ్లీష్ లో కిడ్స్ ఆఫ్ యాక్టివిటీస్ వివరించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ స్కూల్ పివి కనకరాజు మాస్టర్ విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు నిర్యాహించారు. క్రాఫ్ట్ టీచర్ లక్ష్మీ రాజేశ్వరి కాగితాలతో పూల సజ్జలను తయారీపై చేసి చూపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో 55 మంది సభ్యత్వాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయా ధికారిని పి.దమయంతి, బాల బాలికులు పాల్గొన్నారు.

అనకాపల్లి : శాఖవీధి ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో విద్యార్థులకు నేటి బాలలే..రేపటి పౌరులు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన ముగ్గురు విద్యార్థులకు సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం కెరీర్ గైడ్స్, విజ్ఞాన వీచిక పుస్తకాలను బహుమతులుగా అందజేసి వారిని సత్కరించారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వినకోట నీలేశ్ గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణ మోహన్, లైబ్రేరియన్ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం:గ్రంథాలయాలలో పుస్తకాలు ప్రతి ఒక్కరూ చదవాలని అక్షిత కళాశాల రిసోర్స్ పర్సన్ సత్యం విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ధర్మిరెడ్డి సన్యాసినాయుడు, లాలం చిన్న సత్యం, గ్రంథాలయ అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మున్సిపల్ ఎన్నికలు అయిన తరువాత ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వైసిపి పెద్దల నిర్ణయం మేరకు ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులతో ముందుగానే సమావేశం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు ఒకరు మరో రెండు సంవత్సరాలు మరొకరు చైర్మన్, వైస్ చైర్మన్ లు పనిచేస్తారని నిర్ణయించారు. నిర్ణయం మేరకు షెడ్యూల్ క్యాస్ట్‌కు చెందిన కౌన్సిలర్ గుడిబండి ఆదిలక్ష్మికి చైర్మన్ పదవి ఇచ్చారు.ఆమె పదవి కాలం రెండు సంవత్సరాలు కావడంతో ఆమె పదవికి రాజీనామా చేశారు. అదే విధంగా వైస్ చైర్మన్ గా ఉన్న గొలుసు నరసింహమూర్తి రాజీనామా చేశారు. ఈ రెండు పదవులు ఇప్పుడు కొత్తవారికి ఇవ్వడానికి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ రంగం సిద్ధం చేశారు. గతంలో ఇచ్చిన హామీలో బాగంగా చైర్మన్ పదవిని పెద్దబోడ్డేపల్లి 12వ వార్డుకు చెందిన బోడపాటి సుబ్బలక్ష్మికి, వైస్ చైర్మన్ పదవి కొనేటి రామకృష్ణకు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఈనెల 8న ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వైసిపి శ్రేణులు తెలియజేశాయి. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నాయకులను సమన్వయం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందరిని కలుపుకొని వెళుతూ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఇవ్వడం జరుగుతుందని, ఈ లక్ష్యంతోనే ఎమ్మెల్యే గణేష్ పని చేస్తున్నారని వైసిపి శ్రేణులు తెలిపాయి.

ఎంపికైన విద్యార్థులు

క్యాంపస్ డ్రైవ్‌లో 29 మంది ఎంపిక

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పెసెస్ డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎన్ ల్యాబ్స్ (హైదరాబాద్) ఆధ్వర్యాన క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 29 మందిని ఎంఎస్ఎన్ ల్యాబ్స్ ప్రతినిధి కిరణ్ కుమార్ ఎంపిక చేశారు. ఎంపికైన వారు హైదరాబాదులో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వర్తిస్తారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధినేత సిహెచ్ వికే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయప్రకాష్ అభినందనలు తెలియజేశారు.

నిందితుడితో ఎస్ఐ

మద్యం సీసాల పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం :మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో 87 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తుండటంతో బుధవారం రాత్రి గ్రామంలో దాడి చేసి కర్రి గణేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్టు స్థానిక ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

అర్హులకు రైతు భరోసా

ప్రజాశక్తి -నక్కపల్లి:అర్హులైన రైతులకు రైతు భరోసా లబ్ధి చేకూరినట్లు వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు .గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 12298 రైతులకు గాను 9 కోట్ల 22లక్షల లబ్ధి చేకూరిందని, ఆధార్‌కు అనుసంధానం ఉన్న బ్యాంకుల ఖాతాలో 2,3 రోజుల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. వరి, పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో ఏటి కొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్ అప్పలరాజు, ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఏటికొప్పాకలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, 2020-2021 క్రషింగ్ సీజన్ నుండి కార్మికులకు వేతన బకాయిలు 8 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. 2 క్రసింగ్ సీజనులు ముగుస్తున్నా నేటికీ వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులు పస్తులతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు పిఎఫ్ బకాయిలు, గ్రాట్యూటీ ఇతర బెనిఫిట్స్ చెల్లించలేదని, దీంతో 40 సంవత్సరాలకు పైగా కార్మికులు చేసిన కష్టానికి ఏ విధమైన ప్రతిఫలం అందలేదన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వెంటనే కార్మికులకు వేతన బకాయిలను, ఇతర అన్ని బెనిఫిట్స్ వెంటనే అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరిని తెరిపించి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. త్వరలో రాష్ట్ర పారిశ్రామిక మంత్రి గుడివాడ అమర్నాథ్, ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు తెలియ జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కరెడ్ల సత్యనారాయణ, గుండుబోగుల గోవిందరావు, రాయవరపు హనుమంతరావు, కోరిబిల్లి రమణ, పీలా గోవింద్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలరాజు, సంఘం నాయకులు

చిన్నారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి

రూ.1.44 కోట్లతో తాగునీటి పథకం

- ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-మాడుగుల:ఇంటింటికీ మంచి నీటి సరఫరా కార్యక్రమానికి రూ.1.44 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని వీరవల్లి అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి మంచి నీరు అందించే పథకం త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామంలో 188 లబ్ది దారులకు జగనన్న ఇళ్ల పథకం మంజూరు కాగా, ఇందులో 84 ఇళ్ళ నిర్మాణ దశలో వుండగా, 36 ఇళ్ళ నిర్మాణం పూర్తి అయ్యిందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. పడాల సత్యారావుకు డయాలసిస్ నిమిత్తం దరఖాస్తు చేయగా 10 వేల రూపాయల నగదు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, వైస్ ఎంపిపి కొత్తపల్లి శ్రీనివాస్ పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ:అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండలంలో గురువారం ఏఎల్ పురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. గొల్లపేట వీధిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీ నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని పలువురు ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం వెలుగు సిబ్బంది అధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా గ్రామ సంఘాలకు అందిస్తున్న రుణాలకు సంబంధించిన కోటి ఇరవై మూడు లక్షల చెక్కు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, ఎంపిపి జి మణికుమారి, వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఈవోపీఆర్డి రఘురాం, ఆర్డబ్ల్యూఎస్ జెఈ సుదీప్, వెలుగు ఏపీఎం మంగ, స్థానిక ఎంపీటీసీ చింతల బుల్లి ప్రసాద్, వైసిపి, నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఎమ్మెల్యే బాబూరావుకు వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో అక్షాహెబ్ పేటలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు గడపగడపకు మన కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. పలువురు గ్రామంలో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. పలువురు గ్రామస్తులు కాలనీ ఇల్లు మంజూరుకు వేడుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారం చేపడుతుందని తెలిపారు. సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసిల్దార్ జానకమ్మ, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పిఆర్ ఇంజనీర్ వర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, బికెపల్లి ఎంపీటీసీ రాంబాబు, చిన్న బొడ్డేపల్లి సర్పంచ్ శివరాం, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆకట్టుకున్న నాటికలు

ప్రజాశక్తి -మాడుగుల:మండల కేంద్రం లో బుధవారం ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. తొలుత మాడుగు లకు చెందిన గన్నంరాజు సుబ్బారావు మాస్టారు కథా నిలయం పేరిట వారి కుమారుడు గిరిబాబు సమర్పణలో విశాఖ వాసి నటించిన సవారి నాటిక ఆలోచింపజేసింది. డబ్బే ప్రధానం, డబ్బు కోసం తల్లిదండ్రులైనా చంపడానికి సిద్ధపడే కొడుకులు, కుమార్తెలు, డబ్బు ప్రధానంగా భావించి బంధాలు, అనుబంధాలు దూరం చేసుకునే వ్యక్తులు సమాజంలో వున్నారనే ఇతి వృత్తంతో ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. రచన స్వర్గ, తండ్రి పాత్ర, దర్శకత్వం బాలాజీ నాయక్ వహించగా, గిరి బాబు, అనిల్ కుమార్, వాసు, నాయుడు, హేమ, కుమారి నటించారు. సంగీతం లీలా మోహన్, మేకప్, లైటింగ్ ధామస్ అందించారు.

అనంతరం కలిసుంటే నాటిక అబ్బుర పరిచింది. 60 ఏళ్ల వయస్సులో అందమైన అమ్మాయిగా మారాలని కోరుకునే బామ్మ, ఇంటి పనులు పక్కన పెట్టి టివి సీరియల్స్‌కు అతుక్కుపోయిన భార్య, టిక్ టాక్, సెల్ఫీలతో కాలక్షేపం చేసే భార్యతో విసుగెత్తి భర్త అడవుల్లోకి పారిపోవడం, అక్కడ ఇలాంటి బాధితులతో కలవడం, తరువాత ఇంట్లో నుండి వచ్చి తప్పు చేశామని తెలుసుకుంటారు. కుటుంబ సభ్యుల మధ్య చిన్న చిన్న భేదాభిప్రాయాలు సర్దుకు పోవాలి తప్ప ఇగోతో జీవించరాదని తెలియచేసే నాటిక ఆకట్టుకుంది. నంది అవార్డ్ గ్రహీత, జర్నలిస్ట్ ఎస్.డేవిడ్ రాజు రచన, దర్శకత్వం వహించి ప్రధాన పాత్రలో నటించగా బగాది విజయ సాయి, మొహిద్దీన్, శివ జ్యోతి, మల్లిక, కుమారి నటించారు. సంగీతం లీలా మోహన్, రంగాలంకరణ చందు, ఆహార్యం కుమారి, విజయ సాయి సహకారం మొ గిలి గునకర్ అందించారు.

నాటికలో నటిస్తున్న కళాకారులు

అయ్యన్న హయాంలోనే అభివృద్ధి

- కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నంలో విద్య, వైద్య రంగం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు హయాంలో అభివృద్ధి చేశారని మున్సిపల్ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు తెలిపారు. విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అభివృద్ధి అయ్యన్నపాత్రుడు పై వైసిపి నాయకులు, ఎమ్మెల్యే గణేష్ బైక్ ర్యాలీలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విమర్శించడం తగదని ఆగ్రహించారు. 150 పడకల ఏరియా ఆసుపత్రిని అయ్యన్న అభివృద్ధి చేయగా ప్రస్తుతం కొన్ని రోజులుగా జనరేటర్, లిఫ్ట్ పని చేయలేదన్నారు. పారిశుధ్య వాహనాలకు సైతం డీజిల్ వేయలేని ఎమ్మెల్యే గణేష్ అని విమర్శించారు. విజయ్ కు ఎటువంటి పదవులు లేకపోయినా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.